
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 23 మే 2024





నగరంలో భారీ వర్షం

● జలమయమైన రోడ్లు

నిజామాబాద్ అర్బన్, మే 22: నగరంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయిన నగర ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షంతో కొంత ఉపసమనం కలిగింది. వాహనదారులు వర్షంలో తడుస్తూ ఎంజాయ్ చేశారు. చిన్న పిల్లలు వర్షంలో ఆటలు ఆడారు. గాలి దుమారంతో కూడిన వర్షం కురవడంతో కొద్దిసేపు విద్యుత్ అంతరాయం కలిగింది. ప్రధాన రోడ్లన్నీ జలమయం కాగా లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి వర్షపునీరు చేరింది.



'పాలిసెట్'కు ఏర్పాట్లు పూర్తి

నిజామాబాద్ అర్బన్, మే 22: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే పాలిసెట్-2024 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సమన్వయకర్త ఫణి రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న జిల్లా కేంద్రంలోని 16 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30ల వరకు నిర్వహించనున్న పరీక్షకు 5,586 మంది హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10గంటలలోపు విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలని అప్పటి నుంచే విద్యార్థులను అనుమతించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఎస్‌బీటీఈటీఎస్ యాప్ ద్వారా నేరుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవచ్చని 11గంటల తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించడం జరగదని ఆయన తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్, హెచ్‌బి పెన్సిల్, ఎరైజర్, బ్లూ అండ్ బ్లాక్ పెన్ వెంటతెచ్చుకోవాలని సెల్‌ఫోన్, క్యాలిక్‌లేటర్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదన్నారు.





ఆమ్‌చూర్ వ్యాపారుల సిండికేట్!

- ధరతగ్గించి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్నా తక్కువ ధరకే కొనుగోలు
- అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని కోరుతున్న రైతులు

నిజామాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యయ ప్రయాసాలకు ఓర్చి గిట్టుబాటు అవుతుందని ఆమ్‌చూర్‌ను మార్కెట్‌కు తీసుకువస్తే వ్యాపారులు సిండికేట్ కావడంతో ధర రావడం లేదు. గత సంవత్సరం కంటే మామిడి దిగుమతి తగ్గి డిమాండ్ ఉన్నా.. వ్యాపారులు ఎక్కువ ధర పెట్టడం లేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో చింతపండుకు బదులుగా ఆమ్‌చూర్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నా వ్యాపారులు మాత్రం ధర పెట్టడం లేదు. గత సంవత్సరం కంటే ధర తక్కువగా రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర వచ్చే విధంగా చూడాలని అధికారులతో పాటు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి ఆమ్‌చూర్‌ను నిజామాబాద్ మార్కెట్‌కు తీసుకువస్తున్నా ధర రాకపోవడం వల్ల ఖర్చులు పోను తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ధర పెంచి కొనుగోలు చేసే విధంగా చూస్తే తమకు నష్టం రాదని వారంటున్నారు. వర్షాలు పడితే కొనే అవకాశం ఉండదని ముందస్తుగానే అధికారులు చర్యలు చేపట్టి ధర పెరిగే విధంగా చూడాలని మామిడి రైతులు కోరుతున్నారు.

ఆమ్‌చూర్ వైపు రైతుల చూపు

మామిడికి ధర తగ్గినప్పుడు రైతులు ఎక్కువగా ఆమ్‌చూర్‌ను తయారు చేసి మార్కెట్‌లో అమ్మకాలు చేస్తారు. మామిడికి ప్రస్తుతం టన్ను ధర రూ.40 నుంచి రూ.50వేల మధ్య ఉండటంతో ఎక్కువ మంది రైతులు ఆమ్‌చూర్ వైపు మొగ్గు చూపుతున్నారు. మామిడిని కోసి ఆమ్‌చూర్ చేసి ఎండబెట్టి మార్కెట్‌కు అమ్మకానికి తీసుకువస్తున్నారు. రాష్ట్రంలో ఈ ఆమ్‌చూర్‌ను నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లోనే కొనుగోలు చేస్తారు. ఈ మార్కెట్‌కు వరంగల్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలకు చెందిన మామిడి రైతులు ఆమ్‌చూర్‌ను అమ్మేందుకు ఈ మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. గత కొన్నేళ్లుగా నిజామాబాద్ మార్కెట్‌లో ఈ ఆమ్‌చూర్‌ను కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు ఆమ్‌చూర్‌ను కొనుగోలు చేసి యూపీ, బీహార్, ఢిల్లీతో పాటు ఇతర ఉత్తరాధి రాష్ట్రాలకు పంపిస్తారు. అక్కడి వ్యాపారుల డిమాండ్‌కు అనుగుణంగా కొనుగోలు చేసి ప్రతి సంవత్సరం ఆ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఈ సంవత్సరం మామిడి కాతా ఎక్కువగా రాలేదు. వర్షాలు ఇతర వాతావరణ కారణాల వల్ల ఎక్కువ కాయకపోవడం వచ్చిన దిగుబడికి కూడా ధర తగినంతగా లేదు. కొన్ని రకాల మామిడి పండ్లకు డిమాండ్ ఉన్నా మిగతా రకాలకు లేకపోవడం వల్ల రైతులు మామిడిని కోసి ముక్కలు చేసి ఆమ్‌చూర్‌గా అమ్మకాలు చేస్తున్నారు. మామిడి కోయడంతో పాటు వాటిని ఎండబెట్టి మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఈ పని కోసం ఎక్కువగానే ఖర్చు అవుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో డిమాండ్ లేకపోవడం వల్ల ఆమ్‌చూర్ వైపు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌కు వస్తే తగినంత ధర రాకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖర్చులు పోను తమకు మిగిలేది ఎక్కువగా ఉండటం లేదని వాపోతున్నారు.

ఆమ్‌చూర్ వ్యాపారులు కొద్దిమందే

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఆమ్‌చూర్ కొనుగోలు చేసే వ్యాపారులు కొద్దిమందే ఉన్నారు. వీరితో పాటు పది మంది వరకు కమీషన్ ఏజెంట్లు ఉన్నారు. ప్రతి సంవత్సరం ఈ ఆవ్‌చూర్‌ను వీరే కొనుగోలు చేసి ఉత్తరాధి రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఈ మార్కెట్‌లో ఈ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు పెట్టిందే ధరగా ఉంటుంది. ఆమ్‌చూర్‌కు మద్దతు ధర లేకపోవడం వల్ల వ్యాపారులు ముందుగా నిర్ణయించుకున్న ప్రకారమే ధరలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. కొద్దిమంది వ్యాపారులు ఉండటం వల్ల సిండికేటు అయి ధర నిర్ణయించి ప్రతిరోజూ కొనుగోలు చేస్తున్నారు. ఆమ్‌చూర్‌కు డిమాండ్ ఉన్నా ధర పెట్టడం లేదు. గత సంవత్సరం ఆమ్‌చూర్ రూ.20 నుంచి 40వేల మధ్యన క్వింటాలు అమ్మకాలు జరిగాయి. ఈ సంవత్సరం మాత్రం క్వింటాలు రూ.8వేల నుంచి 32వేల మధ్యనే అమ్మకాలు జరుగుతున్నాయి. సరాసరి ఎక్కువ మంది రైతులకు క్వింటాలు రూ.18వేల నుంచి 25వేల మధ్యనే ధర వస్తుంది. మామిడి పంట కోసం సంవత్సరం పాటు వేచి చూసి చేతికొచ్చే సమయంలో ధర తగ్గడం వల్ల తాము నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. గత సంవత్సరం లాగా క్వింటాలు రూ.30 నుంచి రూ.40వేల మధ్య అమ్మకాలు జరిపితే కొంత లాభం ఉంటుందని వారు అధికారులకు వివరిస్తున్నారు. ధర పెరిగే విధంగా చూడాలని ప్రజాప్రతినిధులతో పాటు అధికారులను కోరుతున్నారు. వర్షాలు పడే వరకే ఆమ్‌చూర్‌ను మార్కెట్‌కు రైతులు తీసుకువస్తారని ప్రతిరోజూ సమీక్షించి ధర పెరిగే విధంగా చూస్తే రైతులకు మేలు జరుగుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం ఆమ్‌చూర్ రైతులను పట్టించుకోవాలని వారు కోరుతున్నారు.

దూరం నుంచి తీసుకువచ్చినా ధర రావడం లేదు..

: శివ, కొత్తపల్లి మహబూబ్‌నగర్ జిల్లా



ఆమ్‌చూర్‌ను అమ్మేందుకు మహబూబ్‌నగర్ నుంచి ఇక్కడికి వచ్చినా ఫలితం లేదు. గత సంవత్సరం లాగా ధర రావడం లేదు. ఈయేడు మామిడి దిగుబడి కూడా ఎక్కువగా లేదు. ఆమ్‌చూర్‌కు ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఉన్నా ఇక్కడ కొనుగోలు ఎక్కువగా చేయడం లేదు. అధికారులు పట్టించుకొని గత సంవత్సరం లాగా ధర వచ్చే విధంగా చూస్తే రైతులకు మేలు జరుగుతుంది.

పెట్టుబడి పోను ఎక్కువగా మిగలడం లేదు..

: రాజయ్య, అన్నారం, కామారెడ్డి జిల్లా



మామిడికి భారీగా పెట్టుబడులు పెట్టాం. ధర తగ్గడం వల్ల ఆమ్‌చూర్‌గా మార్చాం. మార్కెట్‌కు తీసుకువస్తే ధర ఎక్కువగా పెట్టడం లేదు. గత ఏడాది క్వింటాలు రూ.30వేల నుంచి రూ.40వేల మధ్య అమ్మకాలు జరిగాయి. సరాసరి క్వింటాలు రూ.30వేలకు పైగా వస్తే రైతులకు న్యాయం జరుగుతుంది. పెట్టుబడిపోను కొంత మిగులుతుంది. అధికారులు పట్టించుకొని ధరవచ్చే విధంగా చూడాలి.



పసుపు సాగుకు సన్నద్ధం

- పసుపునకు భారీగా పెరిగిన ధరలు
- జిల్లాలో మళ్లీ సాగుకు మళ్లుతున్న రైతులు
- విత్తన పసుపును సిద్ధం చేసుకుంటున్న రైతులు
- పసుపు బోర్డు త్వరగా ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్

నిజామాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఈయేడాది మళ్లీ రైతులు పసుపు సాగును పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు. ధర భారీగా పెరగడం ఎగుమతులకు కేంద్రం అవకాశం ఇవ్వడంతో రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. వానాకాలం ఆరంభం కాగానే పసుపు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విత్తనం పసుపును కొనుగోలు చేయడంతో పాటు గత సంవత్సరం కంటే విస్తీర్ణం పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ధర తగ్గడం వల్ల వరి, మొక్కజొన్న, సోయా పంటలకు మారిన రైతులు ఈ సంవత్సరం మళ్లీ పసుపు సాగుకు సన్నద్ధమవుతున్నారు. గత పదేళ్లలో రాని ధర ప్రస్తుతం ఉండటంతో వచ్చే సంవత్సరం కూడా ఇదే రీతిలో ధర వస్తుందని భావిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో సాగు చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ముందస్తుగా విత్తనం సిద్ధం చేసుకొని రైతులు ప్రస్తుతం జిల్లాతో పాటు నిర్మల్, జగిత్యాల, వరంగల్ నుంచి తెచ్చుకుంటూ సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నైజాం కాలం నుంచి పసుపు సాగు

జిల్లాలో నైజాం కాలం నుంచి పసుపు సాగు కొనసాగుతోంది. అప్పటి నుంచి మూడు తరాల రైతు కుటుంబాలు ఈ పసుపు సాగును కొనసాగిస్తున్నారు. గతంలో ధర బాగా ఉన్న సమయంలో జిల్లాలో 45వేల నుంచి 50వేల ఎకరాల్లో రైతులు ఈ పసుపు సాగు చేసేవారు. గత కొన్నేళ్లుగా పసుపుకు భారీగా ధర తగ్గడం పెట్టుబడులు పెరగడం వల్ల రైతులు పంట విస్తీర్ణాన్ని తగ్గించుకున్నారు. కొన్నేళ్లుగా తగ్గిస్తూ వస్తూ గత సంవత్సరం 20వేల ఎకరాలలోపే జిల్లాలో సాగు చేశారు. ఇతర జిల్లాలోనూ ధర లేకపోవడం వల్ల పసుపుసాగు తగ్గింది. ప్రతి సంవత్సరం పెట్టుబడులు పెరుగుతుండటం కూలీల కొరత ఉండటం వల్ల కొంత మంది రైతులు వరి, మొక్కజొన్న, సోయా పంటల వైపు మొగ్గారు. పసుపు సాగును తగ్గించుకున్నారు. సంవత్సరం పొడవున పంట సాగు ఉండటం వల్ల అమ్మకం సమయంలో ధర తగ్గడంతో భారీగా పెట్టుబడి మీద పడుతుండటంతో ఈ సాగును తగ్గించారు. గత సంవత్సరం సాగు బాగా తగ్గగా పసుపుకు డిమాండ్ మాత్రం భారీగా పెరిగింది. కేంద్రం ఎగుమతులను ప్రోత్సహించడం వల్ల ఈ ధర పెరుగుతూ వచ్చింది. క్వింటాలు సరాసరి 8వేల నుంచి 18వేల మధ్య అమ్మకాలు జరిగాయి. రైతులకు గరిష్ఠంగా క్వింటాలు 13వేల నుంచి 15వేల మధ్య ఎక్కువగా అమ్మకాలు జరిగాయి. సాగు తగ్గించిన రైతులకు ఈయేడు పండిన పసుపు వల్ల పెట్టుబడి రావడంతో పాటు లాభాలు కూడా ఎక్కువ మొత్తంలో వచ్చాయి. పసుపునకు ధర కూడా పెరుగుతుండటం ఎగుమతులకు కేంద్రం అనుమతులు ఇవ్వడం వల్ల వచ్చే యేడు కూడా ఇదే రీతిలో ధరలు ఉంటాయని రైతులు భావిస్తున్నారు.

పసుపు బోర్డు ప్రకటనతో డిమాండ్

కేంద్రం పసుపు బోర్డు కూడా ప్రకటించి జిల్లాలోనే ఏర్పాటు చేయనుండటంతో డిమాండ్ వస్తుందని రైతులు భావిస్తున్నారు. ఈ సంవత్సరం మళ్లీ పెద్ద ఎత్తున సాగుకు సిద్ధమవుతున్నారు. గతంలో మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రతిరైతు మళ్లీ సాగును పెంచుతున్నారు. ఉద్యానవన శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఈ సంవత్సరం మళ్లీ జిల్లాలో 30వేల ఎకరాలకు పైగా పసుపు సాగు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇంకా ఎక్కువ మంది మొగ్గు చూపితే విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుం దని భావిస్తున్నారు. జిల్లాతో పాటు పక్కనే ఉన్న జగిత్యాల, నిర్మల్ జిల్లాలో కూడా సాగు పెరుగుతుందని మార్కెట్ అధికారులు అంచనా వేస్తున్నారు. నిజామాబాద్ మార్కెట్‌లో గతంలో 10లక్షల క్వింటాల్ నుంచి 12లక్షల క్వింటాల్ మధ్య అమ్మకాలు జరిగాయి. ఈ సంవత్సరం మాత్రం ఇప్పటి వరకు కేవలం నాల్గున్నర లక్షల క్వింటాల పసుపు అమ్మకాలు జరిగాయి. మూడు జిల్లాల నుంచి పసుపు మార్కెట్‌కు వచ్చిన ఎక్కువ మొత్తంలో సాగు చేయకపోవడం వల్ల ఎక్కువగా రాలేదు. దిగుబడి కూడా బాగా ఉన్న విస్తీర్ణం తక్కువగా ఉండటం వల్ల ఎక్కువగా మార్కెట్‌కు రాలేదు. ధరలు పెరుగుతుండటం వల్ల రైతులు ఆరుతడి పంటలను తగ్గిస్తూ పసుపు సాగువైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ఈయేడు మళ్లీ పసుపు సాగు పెరుగుతుండటం వల్ల అధికారులు ముందుగానే అంచనాకు వస్తున్నారు. వర్షాలు పడి సాగుకాలం ముగిసిన తర్వాత పంట విస్తీర్ణాన్ని అంచనా వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రైతులు మాత్రం ధర పెరగడం వల్ల మళ్లీ పసుపు సాగును పెంచుతున్నామని తెలిపారు. ధర ఉంటే ఎక్కువ మొత్తంలో సాగు చేస్తామని వారు అంటున్నారు. గతంలో ధర ఉన్న సమయంలో 50వేల ఎకరాలకు కూడా సాగు చేశామని వారు తెలిపారు. ధర పెరగడంతో పసుపు సాగు కూడా పెరగనుంది.

పసుపు సాగుకు పెట్టుబడి భారీగా పెరిగింది..

: అంజన్న, రైతు



కొన్నేళ్లతో పోలిస్తే పసుపు సాగుకు పెట్టుబడి భారీగా పెరిగింది. ధరలు లేకపోవడం వల్ల సాగును తగ్గించాం. ప్రతి సంవత్సరం పెట్టుబడి పెరుగుతున్నా కొన్నేళ్లుగా ఒకేవిధమైన ధరలు ఉండటం వల్ల గిట్టుబాటు కాలేదు. ఈ సంవత్సరం ధరలు పెరిగిన విధంగానే కొనసాగితే అధిక సాగు చేపడతారు.

ఈ సంవత్సరం ఐదు ఎకరాల వరకు వేస్తున్నాం..

: పడిగెల ప్రవీణ్, హసకొత్తూర్



పసుపు ధర తగ్గడం వల్ల గత సంవత్సరం రెండు ఎకరాల్లోనే సాగు చేశాం. ఈ సంవత్సరం ధర పెరగడం వల్ల మళ్లీ సాగు విస్తీర్ణం ఐదు ఎకరాలకు పెంచుతున్నాం. పసుపు ధర పెంచడమే కాకుండా మద్దతు ధరను కేంద్రం ప్రకటించాలి. ఈ పంటకు మద్దతు ధర ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది.

పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే డిమాండ్ పెరుగుతుంది..

: గంగన్న, రైతు, కమ్మర్‌పల్లి



కేంద్రం ప్రకటించిన పసుపు బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి. బోర్డు ఏర్పాటు చేస్తే ధర మరింత పెరుగుతుంది. పసుపు రైతులకు మేలు జరుగుతుంది. బోర్డుతో పాటు పసుపు పరిశ్రమలు వస్తే రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. ప్రకటించిన విధంగానే బోర్డును ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై కలెక్టర్ సమీక్ష

పెద్దబజార్, మే 22: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు బోధన్, ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రులపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. జిల్లా ఆసుపత్రిలో ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఆసుపత్రిలో ఆయా విభాగాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సమీక్షించారు. ఒక్కో విభాగం వారీగా ఆయా ఆసుపత్రులలో నెలకొని ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను మెగురు పరిచేందుకు అవసరమైన సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరత, డాక్టర్ల ఖాళీల భర్తీ గురించి ఆయా విభాగాల అధిపతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆసుపత్రుల్లో రోగులు వారి వెంట ఉండే అటెండర్ల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజు సగటున ఔట్ పేషెంట్‌లు ఎంత మంది వస్తున్నారు, ఆసుపత్రిలో చేరుతున్న ఇన్ పేషెంట్‌ల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా జీజీహెచ్‌లో కీళ్లమార్పిడి శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నామని గత ఏడాది 83 సర్జరీలు చేశామని, 75 శాతం నుంచి 35 శాతానికి సిజేరియన్ కాన్పులను తగ్గించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆసుపత్రిలో టెక్నీషియన్‌లు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని ఆమె కలెక్టర్‌కు తెలిపారు. ఎంఆర్‌ఐ, అదనంగా ఐదు ఎక్స్‌రే యంత్రాలు అందుబాటులో ఉంటే రోగులకు మరిన్ని సేవలు అందే వీలవుతుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందుబాటులో ఉన్న పూర్తి సేవలను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సమీక్షలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర, ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరించాలి



ఫత్తేపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్‌రూరల్, మే 22: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. బుధవారం ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో పీఏసీ ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తూ చివరి దశకు చేరుకున్నారన్నారు. రైతుల నుంచి ఇంత వరకు సేకరించిన ధాన్యం వివరాలను నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంటనే తుకం వేయించి ఎప్పటికప్పుడు కేటాయించిన రైస్‌మిల్లులకు పంపించాలన్నారు.

రైస్ మిల్లుల వద్ద ధాన్యం వెంట వెంట అన్‌లోడ్ అయ్యేలా చూడాలని, ఇందుకు ఆర్‌ఐలను నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలను పూర్తి చేయాలని, దీని ద్వారా రైతులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు జరుగుతాయని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజాగౌడ్, డీఎస్‌వో చంద్రప్రకాష్, సివిల్ సప్లయిస్ డీఎం జగదీష్, డీసీవో శ్రీనివాస్, తహసీల్దార్ గజానాన్ తదితరులు ఉన్నారు.











డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

● నలుగురికి వారం రోజుల జైలు శిక్ష

ఖిల్లా, మే 22: మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిని గుర్తించి వారిని కోర్టు ఎదుట హాజరు పర్చడం జరిగిందని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్ సింగేనేవార్ ఆదేశాల మేరకు ప్రతి రోజు వాహనాలను ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వి.వెంకటనారయణ నేతృత్వంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బందిలు తనిఖీ చేపడ్తున్నామన్నారు. బుధవారం నగరంలో వాహనాలను తనిఖీలు చేస్తుండగా వారిలో 13 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించామన్నారు. వీరిని కోర్టు ఎదుట హాజరు పర్చగా మెజిస్ట్రేట్ ఎంఎం.అలీసిరాజ్ 9 మందికి రూ.15,500లు జరిమాన విధించి మరో నలుగురికి 7 రోజుల చొప్పున జైలు శిక్షను విధించినట్లు ట్రాఫిక్ ఏసీపి. బి.నారయణ తెలిపారు.

భద్రాద్రిలో మాజీ ఎమ్మెల్సీ దంపతుల పూజలు

నిజామాబాద్ అర్బన్, మే 22: మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత రాఘవేందర్ దంపతులు బుధవారం భద్రాచలంలోని శ్రీ కోదండ రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవాలని ప్రత్యేక పూజలు చేసినట్లు వారు తెలిపారు. వారి వెంట సీనియర్ నాయకుడు బంటు బలరాం దంపతులు ఉన్నారు.







అనుమతులు లేని పాఠశాలల విషయంలో జాగ్రత్తగా ఉండండి : డీఈవో

● పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌ల అమ్మకాలు నిషేధం

నిజామాబాద్ అర్బన్, మే 22: జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రులు ఏదైనా పాఠశాలలో అడ్మిషన్ పొందే ముందు ఆ పాఠశాలకు అనుమతి ఉన్నది లేనిది సంబంధిత మండల విద్యాశాఖ కార్యాలయంలో తెలుసుకొని ప్రవేశం పొందాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు చేస్తున్న పాఠశాలలను గుర్తించి వాటిని మూసివేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఇదివరకే మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించామని జిల్లాలో అనుమతి పొందకుండా ప్రవేశాలు తీసుకుంటున్న పాఠశాలల ప్రచార బోర్డులను, బ్యానర్‌లను ఇప్పటికే తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు.విద్యార్థులు, తల్లిదండ్రులు ఏదైనా పాఠశాలలో ప్రవేశం తీసుకునే ముందు ఆ పాఠశాలకు గుర్తింపు ఉన్నది లేనిది తెలుసుకోవాలని అది తల్లిదండ్రుల బాధ్యత అని ఆయన అన్నారు. జిల్లాలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ప్రవేశాలు, వేసవి తరగతులు, పాఠశాలల్లోనే యూనిఫామ్‌లు, బెల్టులు, పుస్తకాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అదే విధంగా 70 శాతం ఫీజు ముందే చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసిందని కావున ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న పాఠశాలల విషయం తమ దృష్టికి వస్తే ఎటువంటి నోటీసు జారీ చేయకుండా ఆ పాఠశాల అనుమతులను రద్దు చేయడం జరుగుతుందని డీఈవో తెలిపారు.


ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం

● ఆరు గ్రామాలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

సిరికొండ, మే 22: సిరికొండ మండలంలో తొమ్మిది గ్రామాల్లో బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బుధవారం సాయంత్రం కురిసింది. సుమారు 20 నిమిషాల పాటు విపరీతమైన గాలులతో కూడిన భారీ వర్షం కురవడం వల్ల పలు గ్రామాల్లో చెట్లు విరిగి విద్యుత్ స్థంభాలపై పడటం వల్ల కరెంట్ నిలిచిపోయింది. సిరికొండ బస్టాండ్ సమీపాన వేపచెట్టు, పోలీస్ స్టేషన్‌లో రెండు చెట్లు, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఒక చెట్టు, హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద చెట్టు విరిగిపోవడం వల్ల సుమారు 2గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సిరికొండ, మైలారం, కుర్దుల్‌పేట్, రావుట్ల, న్యావనంది, హుస్సేన్‌నగర్, రామడుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అందకారం ఏర్పడింది. విద్యుత్ పునరుద్ధరించడం కోసం ట్రాన్స్‌కో సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మైలారం గ్రామంలో ప్రధాన రోడ్లపై చెట్లు విరగడం వల్ల అక్కడ విద్యుత్ సరఫరా చేయడంలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని గ్రామస్తులు తెలిపారు.

పెళ్లికి నిరాకరించిందని యువకుడి ఆత్మహత్య

నిజామాబాద్ అర్బన్, మే 22: తను ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపానికి గురై నగరంలోని అరుంధతి నగర్‌కు చెందిన ప్రమోద్‌కుమార్ (24) ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని అరుంధతినగర్‌లో ఉండే ప్రమోద్ పేయింటర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన యువతితో ప్రేమలో ఉన్న ఆయన యువతిని పెళ్లి చేసుకోవాలని కోరడంతో ఆమె పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు తల్లి రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





దేగాంలో నర్సరీ పరిశీలన



దేగాంలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

ఆర్మూర్‌రూరల్, మే22: ఆర్మూర్ మండలం దేగాం గ్రామంలో బుధవారం పల్లె ప్రకృతి వనం, నర్సరీ, కంపోస్టు షెడ్డు, వైకుంఠ ధామాలను జిల్లా పంచాయతీ అధికారి సీహెచ్.తరుణ్‌కుమార్ పరిశీలించారు. నర్సరీలో జర్మినేషన్ రాణి బెడ్స్‌లో కొత్తగా నారు నాటించాలని, అవెన్యూ రోడ్స్‌లో మొక్కలు లేని చోట వర్షాలు కురిసిన వెంటనే కొత్త మొక్కలు నాటించాలని అన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలను వెంటనే వెంటనే శుభ్రం చేయించాలని పంచాయతీ కార్య దర్శి దేవేం దర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శివకృష్ణ, ఆర్మూర్ ఎంపీవో శ్రీనివాస్‌లు ఉన్నారు.

పరమేశ్వర మందిరంలో సప్తాహ



బరంగేడ్గిలో సప్తహ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బీర్కూర్, మే 22 : బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలోని పరమేశ్వర మందిరంలో అఖండ శివనామ సప్తహ పరమ రహస్య పారాయణ మహోత్సవం కార్యక్రమం కొనసాగుతుంది. స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ప్రవచన కారులు, కీర్తన కారులు హాజరయ్యారు. ప్రవచన కారులు అధ్యాత్మిక ప్రవచనాలు, కీర్తన కారులు, శివ కీర్తనలు పాడారు. ప్రవచనాలు, కీర్తనలు భక్తులు భక్తి శ్రద్ధలతో శ్రవణం చేశారు. ఇదిలా ఉండగా బుధవారం హిందూ ధర్మ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణంస్వామి సప్తహలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రవచనాలు చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. భక్తి మార్గంలో నడిచే వారు ఎల్లప్పుడు శాంతంగా, సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న నాటి నుంచి మన సంస్కృతి సాంప్రదాయాలను అలవాటు చేయాలని, వాటి విశిష్టను తెలియ జెప్పాలన్నారు. హిందూ ధర్మం విశ్వశాంతిని కోరుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రతిరోజు కొంత సమయాన్ని శివనామ స్మరణకు కేటాయించాలన్నారు. శివనామ స్మరణ వల్ల సుఖ శాంతులు, సంపూర్ణ ఆరోగ్యం, ఐశ్వర్యం, కీర్త, ప్రతిష్టలు లభిస్తాయని అన్నారు. మానవుడికి ముక్తి లభించాలంటే భక్తి ఒక్కటే మార్గమన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో రూ.2లక్షల రుణమాఫీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మోపాల్, మే 22: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రుణమాఫీని ఈ ఖరీఫ్ సీజన్‌లో 2లక్షల రూపాయలను ఒకేసారి మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుకూలీ సంఘం (ఏఐపీకేఎస్) నాయకులు బుధవారం మోపాల్ తహసీల్దార్ రామేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఖరీఫ్ సీజన్‌లో ఏకకాలంలో రైతులకు 2లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. అన్ని రకాల పంటలకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, మందులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, రూ.500ల బోనస్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడగండ్ల వర్షానికి నష్టపోయిన రైతులందరికి ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాయాగౌడ్, గంగమల్లు, గంగారాం, గంగాధర్, సాయిలు, రవి, పోశన్న, తదితరులు ఉన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



ఏర్గట్ల అధికారులతో మాట్లాడుతున్న అదనపు జిల్లా కలెక్టర్ అంకిత్

ఏర్గట్ల, మే 22: మండలంలో ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. మండలంలోని తొర్తి, గుమ్మి ర్యాల్, ఏర్గట్లలోని పాఠశాలలను సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిపై వివరాలు తెలుసుకొని పనులు పూర్తి చేయాలని ఎంఈవో ఆంధ్రయ్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్, సీసీ సంతోష్, కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

రామాలయానికి మకర తోరణం వితరణ



రామాలయంలో అలంకరించిన మకర తోరణం

నవీపేట,మే22: మండల కేంద్రంలో ఇటీవల పునర్నిర్మాణం చేసి శ్రీరామాలయానికి నవీపేటకు చెందిన యెర్ర ఆనంద్ కుమార్, అర్చన దంపతులు మకర తోరణాన్ని బుధవారం వితరణ చేశారు. సుమారు రూ.30వేల విలువైన మకర తోరణాన్ని ఆలయానికి అందించినట్లు దాతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవీపేట,మే22: నిర్మల్ జిల్లా బాసర రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడ్డ మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. మృతుడికి సుమారు 55 సంవత్సరాల వయసు ఉంటుందని, అతడు నీలిరంగు గీతల షర్టు, లుంగీ ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని ఆయన పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.

ఆర్టీఏ చెక్ పాయింట్‌లో ప్రైవేటు సిబ్బంది ?

● వారికి ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత ● ఇటీవల ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాలు ● బ్లాక్ స్పాట్‌గా గుర్తింపు



జంగంపల్లి శివారులో ఆర్టీఏ చెక్‌పాయింట్

భిక్కనూరు, మే 22: భిక్కనూరు జంగంపల్లి శివారులో 44వ జాతీయరహదారిపై ఉన్న ఆర్టీఏ చెక్‌పాయింట్‌లలో అధికారులు, సిబ్బందితో పాటుగా దాదాపు 10మంది వరకు 24గంటల పాటు షిఫ్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తుంటారు. ఈ చెక్‌పాయింట్ వద్ద రోడుక్కు ఇరువైపులా చేతిలో విజిల్ పట్టుకుని ఎండ, వానతో సంబంధం లేకుండా వీరు వాహనాలను ఆపుతుంటారు. వీరు ప్రతీరోజు ఉదయం 8గంటల నుండి మరుసటి రోజు ఉదయం 8గంటల వరకు (24గంటలు) విధులు నిర్వహిస్తారు. ఇలా 24గంటలు విధులు నిర్వహించిన వారికి ఆసమయంలో ఆర్టీఏ చెక్‌పాయింట్‌లలో విధులలో ఉన్న అధికారులు ఉదయం టిఫిన్‌తో పాటుగా భోజన సౌకర్యం కల్పించి రూ.2వేల నుంచి రూ.2500ల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. అసలు ఈ చెక్‌పాయింట్‌లలో ప్రైవేటు సిబ్బందిని ఇలా నియమించుకోవచ్చునా, ఒకవేళ నియమించుకుంటే వీరిని ఎవరు నియమిస్తారు, జీతాలు ఎవరు చెల్లిస్తారు, వీరికి ఎమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నది మిలియన్‌డాలర్ ప్రశ్న. ఒకవేళ ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు సిబ్బందికి ఏమైనా జరగరానిది జరిగితే కుటుంబ పెద్దను కోల్పోయి వారి కుటుంబ రోడ్డున పడే పరిస్థితి. కాగా విధులు నిర్వహించాల్సిన సిబ్బంది కంటే ఎక్కువగా ప్రైవేటు సిబ్బంది ఎలాంటి డ్రెస్‌కోడ్ లేకుండా విధులు నిర్వహిస్తుండటంతో ఎక్కువగా వాహనదారులతో గొడవలు, ప్రమాదాలు లాంటివి జరుగుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో ఇక్కడ పనిచేస్తున్న ప్రైవేటు వ్యక్తులు అరచేతిలో ప్రాణాలను పెట్టుకుని ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల చెక్‌పాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ప్రమాదానికి కారణమైన లారీ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు.

● ఇటీవల ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాలు...

ఈ చెక్‌పాయింట్ వద్ద విధులు నిర్వహించే ప్రైవేటు సిబ్బంది రోడుకు ఇటువైపు, అటు వైపు ఎక్కువగా తిరగడం, రోడ్డుపై వాహనాల ను నిలపడం కారణంగా ఇటీవల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అధికారులు ఈ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో చాలాప్రమాదాలు జరగగా పలువురు మరణించగా, చాలామంది గాయపడ్డ సంఘటనలు ఉన్నాయి. రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో సైతం జిల్లా అధికారులు సైతం ఆర్టీఏ చెక్‌పాయింట్ వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అక్కడ రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించిన పరిస్థితి ఉంది.

● చెక్‌చెక్‌పాయింట్‌పై గతంలో ఏసీబీ దాడులు

జంగంపల్లి శివారులోని ఈ ఆర్టీఏ చెక్‌పాయింట్‌పై గతంలో ఏసీబీ దాడులు, ఈ చెక్‌పోస్టును ఇక్కడి నుండి తరలించాలని జంగంపల్లి గ్రామస్తులు ఆందోళనలు చేసిన సంఘటనలు ఉన్నాయి. అయిన అధికారుల్లో మార్పు రావడం లేదు. నిత్యం వాహనాలతో కిటకిటలాడే ఈ చెక్‌పోస్టులో వాహనదారుల వద్ద అన్ని కాగితాలు, పర్మిట్‌లు ఉన్న వారి వద్ద నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ డబ్బులు ఇవ్వని ఎడల ఇబ్బందులు పెడతారని, ఇబ్బందులు పడటం ఇష్ట లేక డబ్బులు ఇవ్వక తప్పడం లేదని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు చౌట్‌పల్లిలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి జాతర



ముస్తాబవుతున్న చౌట్‌పల్లి శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం



కొలువుదీరిన శ్రీలక్ష్మీనారాయణస్వామి, శిలాశాసనం

కమ్మర్‌పల్లి, మే 22: మండలంలోని చౌట్‌పల్లి గ్రామ ఆలయంలో కొలువుదీరిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి జాతరా ఉత్సవం గురువారం నిర్వహిస్తున్నటు ఆలయ అర్చకులు సముద్రాల అమర్‌నాథ్‌చారి, వేద పండితులు చౌట్‌పల్లి గంగాప్రసాద్ దీక్షితులు,గ్రామాబివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుంటరమేష్‌రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం రోజు ఉదయం అంకుర్పాన,ధ్వజారోహనంతోమధ్యాహ్నం స్వామి వారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు. కాగాఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, కమిటీ సభ్యులు తెలిపారు.జాతర ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. జాతర రోజు ఆలయం వద్ద శ్రీలక్ష్మీనారాయణ స్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

● ఆలయ నేపథ్యం

అగస్య మహాముని గోదావరి పరివాహక ప్రాంతంలో తపస్సు చేస్తు మూడు శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయాలు నిర్మించాలని ఉపదేశించగా అందులో భాగంగానే లక్ష్మీపురి ప్రస్తుతం చౌట్‌పల్లి గ్రామంలో ఈ ఆలయాన్ని కాకతీయ రాజులు నిర్మించారని,రెండవది మంత్రపురిలో (ప్రస్తుతం కరీంనగర్ జిల్లా మంథని) మూడోవది జైనత్‌లో ప్రస్తుతం అదిలాబాద్ జిల్లా జనత్ మండలంలో ఆలయాలు నిర్మించానట్లు పూర్వీకుల కథనం. చౌట్‌పల్లిలో ఈఆలయాన్ని క్రీ..శ.1870 లో నిర్మించినట్లు ఆలయం వెనుకభాగంలో శిలాశాసనం సంస్కృత భషలో ఉంది. దాని పైసన్ 1277 శుక్లనామ సంవత్సరం మాగ శుద్ధ దశమిగా దాని సారాంశంగా గ్రామ కురువృద్ధులు చెప్పుకుంటారు. కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ ఆలయం తదుపరి కేతిరెడ్డి వంశీయుల ఆధ్వర్యంలో అభివృద్ధి చెందినట్లుగా చెప్పుకుంటారు ఈ ఆలయంలో అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం వైశాఖ పూర్ణిమ రోజు స్వామివారి కళ్యాణం, రథోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవాస్థానంలో మాదిరి ప్రతీరోజు ఉదయం సాయంత్రం స్వామివారి పల్లకీ ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కరెంట్ కోతలతో ఉక్కిరి బిక్కిరి



మద్నూర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్

మద్నూర్, మే 22: ఉమ్మడి మద్నూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ కోతలతో జనాలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఒకవైపు వర్షాలు, మరో వైపు ఎండలు, కారు మబ్బులు కాస్తుండటంతో కరెంట్ సరఫరా నిలిపివేస్తుండటంతో ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. గత కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు, వ్యాపారస్తులు, తదితర చిరువ్యాపారులు ఆందోళన చెందు తున్నారు. కరెంట్ కోతల కారణంగా తాగు నీటి సరఫరాకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఎండలు, వర్షాలకు ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనం కరెంట్ కోతలతో మరింత ఇబ్బందులు పడుతున్నారు.

● చీటికి మాటికి కరెంట్ పోతుంది

కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదు. బయటకు వెళ్లలేక, ఇంట్లో ఉండలేక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.రాత్రివేళలో కరెంట్ పోయిన సమయంలో చిన్నారులు, వృద్ధులు నిద్రపోవడం లేదు. కరెంట్ వచ్చే వరకు జాగారం చేయా ల్సిన దుస్థితి నెలకొంది. పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎండకాలంలో సహజంగా విద్యుత్ వినియోగం పెరుగుతుంది. అనధికారికంగా కోతలు మొదలయ్యాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కూరగాయలు, తదితర పంటలు పండిస్తున్న వారు పడిగాపులు కాస్తున్నారు. ఒక్కొక్క సారి చీటికి మాటికి కరెంట్ పోతుండటంతో లైట్ బుగ్గలు కాలిపోవడం, ఫ్యాన్లు చెడిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గాలి దుమారం కారణంగా విద్యుత్ వైర్లు ఒకటికి ఒకటి తగిలి అక్కడక్కడ ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు. వాటి కోసం ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ వైర్ల మరమ్మతులు చేస్తే కరెంట్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులుం డవని ప్రజలు అంటున్నారు. అధికారులు స్పందించి కరెంట్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?



ప్రమాదకరంగా ఉన్న గుంత



మూల మలుపులో ఉన్న గుంత

రెంజల్,మే22: రెంజల్ మండలంలోని తాడ్ బిలోలి, బోర్గాం వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బోధన్ నుంచి బాసర వెళ్లే ప్రధాన రహదారిపై ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.పదుల సంఖ్యలో గుంతలు ఉండడంతో ప్రయాణికులు ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగించాలంటే ఇబ్బంది పడుతున్నారు. నెలలు గడుస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న ఫలితం లేదన్నారు. ప్రధాన రహదారిగుంతలమయమైన కూడా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.రోడ్డుపైఉన్న గుంతలను త్వరగా పూడ్చి వేయాలన్నారు.

'ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి'



బషారాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ మల్లయ్య

కమ్మర్‌పల్లి, మే 22: వరి కొనుగోల్లో నగం పెంచాలని భీమ్‌గల్ ఏడీఏ కే మల్లయ్య అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామంలో చౌట్‌పలి సహకారసంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని మండలవ్యవసాయాధికారి లావణ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంద్వారా ఇప్పటి వరకు తూకం వేసిన వరి వివరాలను అడిగి తెలుసుకున్నారు.గన్నీబ్యాగ్‌ల నిలువలను, తూకం వేసే హమాలీల సంఖ్యను ఆయన పరిశీలించారు. వారంలోగా వరికొనుగోల్లను పూర్తిచేసి సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం ఇన్‌చార్జి మారుతికి ఆదేశాలు జారీ చేశారు.కాగా అకాల వర్షాల కారణంగా రైతులు తాము కొనుగోలు కేంద్రాలకు తరలించిన వరి ధాన్యం కుప్పలు తడవకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ఏడీఏ వెంట ఏవో లావణ్య, ఏఈవోలు కావ్య, పద్మ, స్థానిక రైతులు సెంటర్ బాధ్యులు ఉన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు అందేలా చూడాలి



పిప్రిలో రిజిష్టర్‌లను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అశోక్

ఆర్మూర్‌రూరల్, మే22: వ్యాధి నిరోధక టీకాలు ప్రతీఒక్క చిన్నారికి తప్పకుండా అందేలా చూడాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలంలోని ఫతేపూర్, పిప్రి గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాలను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్‌తో కలిసి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల లబ్ధిదారుల జాబితాను ముందస్తుగా తయారు చేసుకొని ప్రతీ చిన్నారికి టీకాలు వేసే విధంగా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎండలు అధికంగా ఉన్నందున వ్యాక్సిన్ కోల్డ్‌చైల్డ్ పాటించాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు అధికంగా జరిగేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించాలన్నారు.ఈకార్యక్రమంలో ఆర్మూర్ సబ్‌యూనిట్ అధికారి సాయి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశకార్యకర్తలు పాల్గొ న్నారు.

కొనసాగుతున్న కబడ్డీ శిక్షణ శిబిరం



ముప్కాల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ముప్కాల్, మే22: ముప్కాల్ మండల కేంద్రంలోని చైతన్య నెహ్రూ యువజన సంఘ క్రీడా మైదానంలో జూనియర్ బాలుర కబడ్డీ శిక్షణ శిబిరం కొనసాగుతుంది. బుధవారం వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులకు కబడ్డీలో మంచి నైపుణ్యం సాధించడానికి ఏర్పాటు చేసిన అండర్-16, అండర్-14 విభాగాల్లో 50మంది క్రీడాకారులకు పీడీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు ఉచిత భోజన సౌకర్యంతో పాటు కబడ్డీలో మంచి నైపుణ్యం అందిస్తున్నట్టు పీడీ తెలిపారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



భిక్కనూరులో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్ రావు

భిక్కనూరు, మే 22: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీపీవో శ్రీనివాస్‌రావు గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని, ఏదైనా నీటి సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని, ఉపాధిహామీ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని, ఉపాధిహామీ పని జరుగుతున్న చోట కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏపీవో రాధిక, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు మద్నూర్‌లో రథోత్సవం



ముస్తాబు చేసిన రథం

మద్నూర్, మే 22: మండల కేంద్రంలోని లక్ష్మీ నారాయణ మందిరంలో వైభవంగా జరుపుకునే రథోత్సవ ఏర్పాట్లు పూర్తి చేశారు. 23, 24 తేదిల్లో రథోత్సవం జరుగనుంది. బుద్ధ పౌర్ణమి నాడు ప్రతి యేడాది ఆనవాయితీగా నిర్వహిస్తారు. గ్రామంలో రథాన్ని ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 24న కుస్తీ పోటీలు జరుగుతాయి. రథోత్సవాన్ని తిలకించడానికి మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భక్తులు వస్తారు. పూర్వ కాలం నాటి రథానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. సుమారు 500 ఏండ్ల క్రితం రథం ఇప్పటికి చెక్కు చెదరకుండా ఉండటంతో చుట్టూ పక్కల వంద కిలో మీటర్ల దూరం ఇలాంటి రథం లేకపోవడంతో భక్తులు తరలివస్తారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లుచేశామని నిర్వాహకులు తెలిపారు. రథం గల్లీలో జాతర ఉంటుందని తెలిపారు.

బీడీ టేకేదార్ పై చర్యలు తీసుకోవాలని ఆందోళన

డిచ్‌పల్లి,మే 22: ఇందల్వాయి మండల కేంద్రంలో చార్‌బాయి బీడీ కార్ఖన టేకేదార్ వైకుంఠం మహిళ బీడీ కార్మికులను దూషిస్తు ఇబ్బందులకు గురిచేస్తున్నడని ఆరోపిస్తు బీడీ కార్మికులు బుధవారం మండల కేంద్రంలోని చార్‌బై సెంటర్ కార్ఖన ఎదుట ఆందోళన చేశారు. తాను చెప్పింది వినాలని టే కేదార్ వైకుంఠం బెదిరిస్తున్నాడని తక్షణమే ఆయన పై చర్యలు తీసుకోవాలని కార్ఖన యాజమన్యానికి వినతి పత్రంఅందజేశారు.

గంగాజలాలతో ఊరేగింపు



గంగాజలాలతో ఊరేగింపు నిర్వహించిన మహిళలు

మోపాల్, మే 22: గంగాజలాలతో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం బోర్గాం(పి) గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. గంగమ్మ జాతర, బోనాల పండుగను గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గోదావరి నుండి తీసుకువచ్చిన గంగాజలాలను గంగమ్మతల్లికి జలాభిషేకం చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి గంగమ్మ జాతర, బోనాల ఊరేగింపును పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు అశోక్ తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో పాటు చెరువులు, కుంటలు నిండాలని పెద్ద ఎత్తున గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగానే ఐదు సంవత్సరాలకొకసారి గోదావరి నుండి గంగాజలాన్ని తీసుకువచ్చి గంగమ్మ తల్లికి జలాభిషేకం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలతో పాటు పురుషులు, యువకులు పెద్దఎత్తున పాల్గొంటారని తెలిపారు.గురువారం ఉదయం బోనాలతో ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జనార్ధన్, ఆలయ కమిటీ చైర్మన్‌తో పారం నాగన్న,చిన్ననర్సయ్య,నర్సింహస్వామి,కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పలు హోటళ్లలో తనిఖీలు

● శుభ్రత పాటించని హోటళ్లకు జరిమానాలు



తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

సుభాష్‌నగర్, మే 22: నగరంలోని పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిధిలోని పలు హోటళ్లలో బుధవారం మున్సిపల్ ఎంహెచ్‌వో సాజిద్ అలీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. శుభ్రత పాటించని హోటళ్లకు జరిమానా విధించారు. 10హోటళ్లలో తనిఖీలు నిర్వహించి సుమారు 15వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎంహెచ్‌వో సాజిద్ అలీ మాట్లాడుతూ నగరంలోని హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని ఆదేశాలు జారీచేశారు. శుభ్రత పాటించని హోటళ్లపై తనిఖీలు నిర్వహించి భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో ఎగ్జామ్ అబ్జర్వర్ తొలగింపు

● డిగ్రీ పరీక్షల్లో మూడు మాల్ ప్రాక్టీస్ కేసులు ● డిగ్రీ పరీక్షలకు 772మంది గైర్హాజరు

డిచ్‌పల్లి, మే 22: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల విధుల్లో బోధన్ మిమ్స్ కళాశాల కేంద్రంలో అలసత్వం వహించిన అబ్జర్వర్ శ్రీకాంత్‌ను విధుల నుంచి తొలగించినట్లు టీయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో 772మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. డిగ్రీ 2,4,6 వ సెమిస్టర్ రెగ్యులర్, పరీక్షలు ఉదయం 1,3,5వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు జరగాగ రెగ్యులర్ పరీక్షలకు 9109 అభ్యర్థులకు గాను 8337 మంది హాజరుకాగ 772 విద్యార్థులు గైర్హాజర య్యారని, బ్యాక్ లాగ్ పరీక్షల్లో 8020 మంది విద్యార్థులకు గాను 7493 పరీక్ష కు హాజరయ్యారని, 527మంది విద్యార్థులు ఈ పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు. నిజామాబాద్ సీఎస్ఐ లో ఒకరు చూచిరాతలకు పాల్పడుతూ మాల్ ప్రాక్టీస్ లో నమోదు అయ్యారని ఆయన పేర్కొన్నారు.

ఐమాస్ట్ విద్యుత్ దీపాలకు మరమ్మతులు

ధర్పల్లి, మే 22: మండల కేంద్రంలో గత కొంత కాలంగా వృధాగా ఉన్న ఐమాక్స్ విద్యుత్ దీపాలకు బుధవారం మరమ్మతులు చేశారు. ప్రత్యేకంగా క్రేన్ తీసుకువచ్చి లైట్లకు మరమ్మతులు చేశారు. ప్రధాన రోడ్లలో ఐమాక్స్ లైట్లు వెలగకపోవడంతో గ్రామస్తులు పంచాయతీ సిబ్బందికి విన్నవించడంతో అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో వీధి దీపాలతో పాటు ఐమాక్స్ లైట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేసినట్లు మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ, పంచాయతీ ఈవో సైఫొద్దీన్‌లు తెలిపారు.



ఐమాక్స్ లైట్‌లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

చక్రం గుడిలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం



నగరంలో చక్రం గుడిలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



భీమ్‌గల్‌లో సూర్యప్రభ వాహనం పై శ్రీ లక్ష్మీ నరసింహస్వామి

నిజామాబాద్ అర్బన్, మే 22:నగరంలోని చక్రం గుడి దేవాలయంలోని లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కళ్యాణ వేడుకకు లక్ష్మీనర్సింహస్వామి విగ్రహాలను ఉంచి వేదపండితులు కందాలై హైగ్రీ వాచార్య, అర్చకులు అమిత్‌కుమార్ ఆచార్య, అజిత్‌కుమార్ ఆచార్యలు కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కళ్యాణానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, గోవర్ధనం సందీప్‌కుమార్, గోపాలకృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి గ్రామంలో ఉన్న నర్సిం హస్వామి ఆలయంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో యజ్ఞం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆల యానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు,గ్రామపెద్దలు గ్రామస్తులు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతిని పురష్కరించుకొని బుధవారం భీమ్‌గల్ మండలంలోని గ్రామాలయంలో కన్నుల పండువగా నిర్వహించారు. సూర్యప్రభ వాహనం పై స్వామి వారిని ఆశీనులను చేసి మాఢ వీదుల్లో ఊరేగించారు. బంగారు ఆభరణాలతో స్వామి అలంకరణ చేశారు. పూర్ణిమ జయంతి కావడంతో భక్తులు ఉదయం నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. గ్రామాలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో వెంకటేశ్వర కాలనీలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో స్వామివారికి చిలకమర్రి వర్ధనచార్యులు ఆధ్వర్యంలో యజ్ఞం, ధ్వజ రోహణం, గరుడ పీఠాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన దంపతులకు గరుడ ముద్దలను అందజేశారు. ఉత్సవాల్లో పురోహితుడు, ఆలయ ధర్మకర్తలు శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, పురోహితుడు ఆనందచార్యులు, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న పురోహితులు

● జక్రాన్‌పల్లిలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి జయంతి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి జయంతి ఉత్సవాలను భక్తులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కొలిప్యాక్, జక్రాన్‌పల్లి, మునిపల్లి, అర్గుల్ గ్రామాల్లో శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయాల్లో భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

మోర్తాడ్, పచ్చలనడ్కుడలో జీలుగ విత్తనాల పంపిణీ



మోర్తాడ్ పీఏసీఎస్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి



పచ్చలనడ్కుడలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి

మోర్తాడ్, మే22: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం 60శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి లావణ్య మాట్లాడుతూ 30కిలోల జీలుగ బస్తా పూర్తి ధర రూ.2790 కాగా 60శాతం రాయితీపై రూ.1116 రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. పచ్చిరొట్టె జీలుగ పైరు సాగు చేయడం వల్ల చౌడు నేలలను పునరుద్ధరించుకొని ఆ నేలల ఉత్పదకాలను పెంచుకోవచ్చని అన్నారు. జీలుగ పైరు వల్ల నేల భౌతిక స్థితి మెరుగుపడి నేలకు నీటిని, పోషకాలను నిలుపుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. జీలుగ పైరును పూత దశలో కలియదున్నారు. ఆ సమయంలో ఎకరానికి 50కేజీల సూపర్ స్పాస్ఫెట్ వేస్తే త్వరగా కుళ్లిపోతుందని దున్నేటప్పుడు ఆమ్లాల వల్ల నేలలో మొక్కలకు పోటాషియం అందడమే గాక నత్రజనీ స్థిరికరించబడుతుందన్నారు.. జీలుగ కావాల్సిన రైతులు పట్టాపాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శికాశీరాం,ఏఈవోశ్రీలత, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పచ్చిరొట్టే ఎరువుల వల్ల అధిక లాభాలు

వేల్పూర్: పచ్చిరొట్టే ఎరువుల వాడకం వల్ల సాగు పంటలకు అధిక లాభాలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి నర్సయ్య అన్నారు. బుధవారం మండలంలోని పచ్చలనడ్కుడ, రామన్నపేట్ గ్రామాలల్లోని సొసైటీల వద్ద రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30కిలోల జీలుగ బస్తాకు 60శాతంతో రూ.1116 అందించడం జరుగుతుందన్నారు. పచ్చిరొట్టే ఎరువులు వాడడం వల్ల నేలలో సేంద్రీయ కార్బణం పెరుగుతుందని, పొలంలో జీలుగ విత్తనాలు చల్లిన 20నుంచి 35రోజుల్లో మొక్క పెరిగి పూత దశకు వస్తుందన్నారు. ఆ సమయంలో మొక్కలను రోటవేటర్‌తో పొలంలో కలియదున్నాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ సీఈవోలు రణవీర్, యు.స్వామి, ఏఈవో షబ్బీర్, వినయ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగాస్థాన్ ఫేస్-2లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్,మే22:నగరంలోని గంగాస్థాన్ ఫేస్-2 లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరా యం ఏర్పడుతుందని నగర టౌన్-2 ఎడిఈ తోటరాజ శేఖర్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరా యం ఏర్పడుతుందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ డ్రైనేజీ నిర్మాణంలో అడ్డు వస్తున్న 11కెవి ఎల్‌టి లైన్‌లను పక్కకు మార్చడానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.విద్యుత్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుం దని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎత్తిపోతల పనులు పూర్తి చేయాలి



లక్మాపూర్‌లో పంప్‌హౌజ్ పనులను పరిశీలిస్తున్న జడ్పీచైర్మన్

మాక్లూర్, మే22: మండలంలోని లక్మాపూర్ వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌజ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు.బుధవారం లక్మాపూర్ గ్రామంలో పంప్ హౌజ్ వద్ద నిర్మాణంలో ఉన్న పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు పూర్తయితే ముల్లంగి, బోంకన్‌పల్లి గ్రామాల రైతులకు లబ్ధిచేకురుతుందని అన్నారు. ఆయన వెంట నాయకులు జలంధర్‌రావు, శేఖర్‌రావు, పోశెట్టి, తదితరులు ఉన్నారు.

గంగమ్మ జాతర ఉత్సవాలకు ముస్తాబు



మిట్టపల్లిలో ముస్తాబైనా ఆలయం

డిచ్‌పల్లి,మే 22:మండలంలోని మిట్టపల్లి లో గంగమ్మ జాతర ఉత్సవాలను నేటి ప్రారంభిస్తున్నట్లు గంగపుత్ర సంఘం ప్రతినిధులు తెలిపారు. 5వ తేదిన బోనాల ఊరేంపు, గంగమ్మ కల్యాణం, వంటి పూజ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

రేపు వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్, మే22: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈనెల 24న వాహనాలను వేలం నిర్వహిస్తున్నట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ స్టివెన్‌సన్ తెలిపారు. పలు కేసులలో పట్టుబడ్డ మూడు వాహనాలను వేలం నిర్వహిస్తున్నట్టు వేలంలో పాల్గొనే వారు 25శాతం రిబిట్ జమ చేసి పాల్గొనాల్సిందిగా ఆయన తెలిపారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి

ధర్పల్లి, మే 22: తెలంగాణలో పండించే అన్ని రకాల వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500ల బోనస్ చెల్లించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బుధవారం ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సభ ప్రారంభానికి ముందు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్‌కుమార్‌కు నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేసిన అనంతరం ప్రవీణ్‌కుమార్ రైతులకు చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సన్నవడ్లకే 500ల బోనస్‌ను ప్రకటించడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. అన్ని రకాల వడ్లకు 500ల బోనస్ చెల్లించాలని తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను సభలో చదివి వినిపించారు. వ్యవసాయ అధికారి వెంకటేశ్ మాట్లాడుతూ జీలుగ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని 30 శాతం సబ్సిడీతో మండలంలోని ధర్పల్లి, రామడుగు, ఒన్నాజిపేట్ సింగిల్ విండోలలో రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా కొరత లేదని రైతులు కొరత ఏర్పడుతుందోనని బస్తాలను డంప్ చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రతి రైతుకు యూరియా అందించడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం మండల వైద్యాధికారి మాట్లాడుతూ మండల కేంద్రంలోగల 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా నిర్మించేందుకు నిధులు విడుదల అయ్యాయని పాత భవనాన్ని కూల్చి కొత్తగా ఆసుపత్రిని తాత్కాలికంగా బీసీ వసతి గృహంలో నిర్వహిస్తున్నట్లు ఆయన సభ దృష్టికి తెచ్చారు. ఆసుపత్రిలో అన్ని రకాల వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశం ఎంపీటీసీలకు చివరి కావడంతో సభ్యులు అంతగా ఆసక్తి చూపలేదు. ఐదుగురు సభ్యులు రావడంతో గంటపాటు సమావేశం ఆలస్యమైంది. వివిధ శాఖల అధికారులు తమ నివేదికను వినిపించి మమా అనిపించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి, సీనియర్ అసిస్టెంట్ గంగాధర్,ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

కోటగిరిలో కంటి వైద్య శిబిరం

కోటగిరి,మే22: కోటగిరి మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్‌లో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బోధన్ లయన్స్ క్లబ్ సహకారంతో 25మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు సతీష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు హన్మంత్ రావు, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చందూర్‌లో వైభవంగా ఎల్లమ్మ దేవి జాతర ఉత్సవాలు

వర్ని,మే22: చందూర్ మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ దేవి ఉత్సవాల్లో భాగంగా గ్రామ ప్రజలు అమ్మవారి ఉత్సవాలు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి నూతన వస్త్రాలను అలంకరించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాంప్రదాయ ప్రకారం పోతరాజుల వంశానికి చెందిన శంకర్ అనే వ్యక్తి ఎల్లమ్మ కల్యాణం నిర్వహించిన రెండు గంటల పాటు ఒంటి కాలుపై నిల్చున్నాడు. ఈ సందర్భంగా జాతర కొనసాగగా జిల్లా పరిసరాలతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం కుస్తీపోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని కుల సంఘాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, మే22: మండలం లోని పిప్రిగ్రామంలో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం వడ్డేపల్లికి చెందిన ఎర్రోల్ల కాశీరాం(42) అనే వ్యక్తి మంగళవారం చెరువులో పడి మృతి చెందాడు. పిప్రిగ్రామంలో దినసరి కూలీగా పని చేస్తున్న ఆయన మద్యం మత్తులో ప్రమా దవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతు డు సోద రుడు ఎర్రోల్లరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



చెరువులో పడి మృతి చెందిన ఎర్రోల్ల కాశీరాం

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,200	రూ.68,500	రూ.910

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫ్యూరియోసా (ఇంగ్లీష్) (11.45, 6.15, 9.30)
: ఫ్యూరియోసా (తెలుగు) (3.00)
స్క్రీన్-2 : ది ఘర్‌ఫీల్డ్ మూవీ (ఇంగ్లీష్ 3డి) (2.30, 8.05)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (4.55)
: ఫ్యూరియోసా (తెలుగు) (10.30)
స్క్రీన్-3 : కర్గమ్ భుగ్గం (హిందీ) (1.10)
: ఆ ఒక్కటి అడక్కు (4.05)
: శ్రీకాంత్ (హిందీ) (7.00, 10.00)
స్క్రీన్-4 : నటరత్నాలు (11.05)
: అపరిచితుడు (1.45)
: మిరల్ (5.30, 10.30)
: అక్కడ వారు ఇక్కడ ఉన్నారు (8.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (10.45, 1.30, 4.40, 7.20, 10.20)
స్క్రీన్-2 : ఫ్యూరియోసా (తెలుగు) (10.45, 1.45, 7.40, 10.40)
: ఫ్యూరియోసా (ఇంగ్లీష్) (4.45)
స్క్రీన్-3 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.45, 10.35)
: బాక్ (7.35)



- నిజామాబాద్ అర్బన్